

శ్రీ పద్మావతి అమ్మవారికి ముత్యాల హారం వితరణ

ప్రజాశక్తి - తిరుచానూరు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి ఒంగోలుకు చెందిన భక్తుడు వరప్రసాద్ 51వేల రూపాయల విలువ చేసే ముత్యాల హారాన్ని ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, వి.ఐ.రామ్మోహన్, ఇన్స్పెక్టర్లు ప్రసాద్, గణేష్, బాబు స్వామి కి అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమ సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో...
ఆపరేషన్లు 'బంద్'

- వారం రోజులుగా మూతపడ్డ 'ఓటీ'
- కేసులన్నీ తిరుపతికి రెఫర్
- 'నాడు-నేడు' నిర్మాణాల్లో తీవ్ర జాప్యం
- పట్టించుకోని జిల్లా వైద్యాధికారులు

పేదల పెన్నిధి పెద్దాస్పత్రి(ఏరియా ఆసుపత్రి)లో ఆపరేషన్లు 'బంద్'.. అదనపు గదుల నిర్మాణం.. మరమ్మతుల్లో జాప్యం వెరసి..ఏరియా ఆసుపత్రి వార్డులు చాలా వరకు ఉరుస్తున్నాయి. ముఖ్యంగా ఆపరేషన్ థియేటర్, దాని అనుబంధ గదులన్నీ పెయింట్ పెచ్చులూడి ఉరుస్తుండడంతో అన్ని రకాల ఆపరేషన్లను వైద్యాధికారులు వారం రోజులుగా నిరవధికంగా వాయిదా వేయాల్సిన పరిస్థితి. దీంతో కేసులన్నింటినీ తిరుపతికి రెఫర్ చేస్తుండడంతో పేదరోగులు ఇబ్బంది పడుతున్నారు. పెద్దాస్పత్రిలో ఇంత జరుగుతున్నా జిల్లా వైద్యాధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'కొండ నాలుకకు మందేస్తే..ఉన్న నాలుక ఊడిందన్న' చందాన తయారైంది ఏరియా ఆసుపత్రి పరిస్థితి. నాడు-నేడు పనుల్లో భాగంగా ఆసుపత్రిలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం, మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతుండడంతో అసలుకే మోసం వచ్చింది. రెండో అంతస్తులో అదనపు గదులు నిర్మాణం చేపట్టడం వల్ల మొదటి అంతస్తులోని అన్ని వార్డుల్లో పెచ్చులూడి ఉరుపు మొదలైంది. కొన్ని వార్డులను వైట్ ప్రేమర్ వేసి ఉరుపును అదుపు చేసినా ఆపేరేషన్ థియేటర్, దాని అనుబంధ గదుల్లో మాత్రం ఉరుపు ఆగని పరిస్థితి. దీంతో రెండో అంతస్తులో క్యూరింగ్ కోసం వాడుతున్న నీళ్లు మొదటి అంతస్తులో ఉన్న ఆపరేషన్ థియేటర్ లోకి లేకేజీల రూపంలో చొచ్చుకొస్తున్న పరిస్థితి. అంతేకాకుండా ఆపరేషన్ థియేటర్ పైకప్పు నుంచి పెయింట్ పెచ్చులూడి పడుతుండడంతో సర్జరీ సమయంలో రోగులకు ఇన్ఫెక్షన్లు వస్తున్నాయి. దీంతో చేసేదేమీ లేక వైద్యులు ఆపరేషన్లను నిరవధికంగా వాయిదా వేయాల్సిన దుస్థితి తలెత్తింది. అదేవిధంగా ఆసుపత్రి మరమ్మతు పనుల్లో భాగంగా ఆపరేషన్ థియేటర్కు ఏసీ, నీటి వసతిని తొలగించారు. దీంతో ఉక్కపోతల మధ్య వైద్యులు సర్జరీలు చేయాల్సిన పరిస్థితి. సుమారు రూ.12 కోట్ల వ్యయంతో ఆసుపత్రిలో అభివద్ధి పనులు జరుగుతున్నాయి. ఇటీవలే అన్ని వార్డులకు మరమ్మతులు చేసి పెయింట్ వేశారు. అయితే రెండు నెలలు కూడా గడవకముందే పెయింట్ ఊడిపోతుండడంతో ఆపరేషన్ థియేటర్ను మూసేయాల్సి వచ్చింది. సాధారణంగా ఏహెచ్లో రోజుకు గరిష్టంగా పది ఆపరేషన్లు వరకు జరుగుతుంటాయి. వీటిలో సిజేరియన్ ఆపరేషన్లు అధికంగా జరుగుతుండగా, ఆ తర్వాత కు.ని ఆపరేషన్లు, ఆ తర్వాత సాధారణ సర్జరీలు జరుగుతుంటాయి. అయితే వారం రోజులుగా ఆపరేషన్ థియేటర్ను మూసివేయడంతో కేసులన్నింటినీ తిరుపతికి రెఫర్ చేస్తున్నారు. అదనపు ఆపరేషన్ థియేటర్ పూర్తి కావడానికి మరో నెలన్నర రోజులైనా పట్టేలా ఉండడంతో పెద్దాస్పత్రికి వచ్చే పేద రోగుల పరిస్థితి ఏంటో అర్థం కానీ పరిస్థితి. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

కొత్త ఓటీ కోసం ప్రతిపాదన పంపాం: డాక్టర్ విజయలక్ష్మి, ఏహెచ్ సూపరింటెండెంట్

ఏరియా ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ను ఇన్ఫెక్షన్ కారణంగా మూసివేసిన మాట వాస్తవమే. పెయింట్ పెచ్చులూడి పడుతుండడంతో సర్జరీ సమయంలో రోగులకు ఇన్ఫెక్షన్లు ఏర్పడుతున్నాయి. దీంతో ఆపరేషన్లు వాయిదా వేశాం. కొత్త ఆపరేషన్ థియేటర్ ను వెంటనే పూర్తి చేసి ఇవ్వాలని కలెక్టర్ కు నివేదించాం.

'విక్కీ'కి వినూత్నంగా అంతిమ సంస్కారాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సహజంగా మనిషికి అంతిమ సంస్కారాలు చేస్తుంటాం.. అయితే పెంపుడు కుక్క మరణాన్ని జీర్ణించుకోలేని ఆ యజమాని అచ్చం మనిషి అంతిమయాత్ర జరిపినట్లుగా అట్టహాసంగా నిర్ణయించారు. మానవీయ విలువలు మంటగలిసిపోతున్న నేటి కంప్యూటర్ యుగంలో మూగజీవుల పట్ల అతనికి ఉన్న ప్రేమ, ఆయనిచ్చే ప్రాధాన్యత వెలకట్టలేనిది. తాను పెంచుకున్న కుక్కకు వెటర్నరీ వైద్యుల అందించిన వైద్యం వికటించి మృతి చెందడంతో న్యాయ పోరాటానికి సైతం దిగడం పలువురిని ఆశ్చర్యం గొల్పింది. ఆసక్తిదాయకమైన ఈ సంఘటన తిరుపతిలో చోటు చేసుకుంది. ఆ ఘటన పూర్తి వివరాలు...

తిరుపతి శ్రీనివాసపురంలోని బ్లిస్ హోటల్ సమీపంలో నివశిస్తున్న తాళ్లపాక దాము కొంత కాలంగా డాల్ఫేయన్ జాతికి చెందిన ఓ కుక్కను అపురూపంగా పెంచుకుంటున్నాడు. విక్కీ అని పేరుపెట్టి ముద్దుగా చూసుకునేవాడు. ప్రస్తుతం దాని వయస్సు 3 సంవత్సరాలు 4 నెలలు. నెల వారీ వైద్య పరీక్షల్లో భాగంగా వెటర్నరీ ఆసుపత్రికి తీసుకెళ్లడం పరిపాఠి. ఇటీవల వెటర్నరీ ఆసుపత్రిలో పని చేసే అటెండరు టి.అయ్యోరయ్య సాధారణ చెకప్లో భాగంగా దాము ఇంటికి వెళ్లి, తాను వెటర్నరీ ఆస్పత్రి నుంచి వస్తున్నానని చెప్పి, ఆయన పెంపుడు కుక్క విక్కీకి ఓ ఇంజక్షన్ ఇచ్చాడు. రెండు రోజుల తర్వాత కుక్కకు వెనక రెండు కాళ్లు పని చేయకపోవడంతో పాటు కుక్క రంగు మారింది. దీన్ని గమనించిన యాజమాని విక్కీని వెటర్నరీ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు కుక్కను పరిశీలించి, దీనికి రాబీస్ వ్యాధి సోకిందని, పైగా క్యాన్సర్ కూడా ఉందని, దీన్ని ఎవ్వరు తాకవద్దని,

కుక్కచావుకు వైద్యులపై న్యాయపోరాటం

ఈ కుక్కను మెరిసీ కిల్లింగ్ చేయాలని సూచించారు. వారి ధోరణి పట్ల అనుమానం వచ్చిన యాజమాని అందుకు నిరాకరించి, కుక్కను తీసుకుని చెన్నయ్లోని ఓ ఆసుపత్రిలో చూపించారు. అక్కడ వైద్యులు పలు పరీక్షలు చేసి, కుక్కకు ఇటీవల వేసిన ఇంజక్షన్ వల్ల ఇలా అయ్యిందని, ఎలాంటి అనుభవం లేని వ్యక్తి ఇంజక్షన్ వెన్నుపూసకు వేయడంతో పెరాలసిస్లా వచ్చిందని, పరిస్థితి చేయదాటి పోయిందన్నారు. అక్కడ వైద్యులు ఇచ్చిన రిపోర్టుతో యాజమాని జిల్లా కలెక్టరుకు, తిరుపతి ఎంపికి, ఈస్టు పోలీసు స్టేషన్ సిఐకు వెటర్నరీ వైద్యులు, సిబ్బంది, ఆ కళాశాల డీన్ తదితరులపై ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టరు విచారణ చేయాలని సూచించారు. ఇంతలో ప్రేమగా పెంచుకున్న విక్కీ మంగళవారం ఉదయం మృతి చెందింది. దీంతో కన్నీటిపర్యంతం అయిన యజమాని, కుటుంబ సభ్యులు కుక్క మృతదేహాన్ని బాడీ ఫ్రీజర్లో ఉంచి బంధువులకు సమాచారం ఇచ్చారు. మనుషులకు చేసేలా కుక్కకు కూడా సాంప్రదాయబద్దంగా దహన సంస్కారాలు చేసేందుకు పూనుకున్నాడు. కుక్క మృతి విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం కుక్క మృతదేహాన్ని వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని యజమానికి అప్పగించడంతో డ్రమ్స్, పలకల మధ్య ఊరేగింపుగా విక్కీ మృతదేహానికి సాంప్రదాయ పద్ధతిలో దహస క్రియలు పూర్తి చేశారు. పోస్టుమార్టం రిపోర్టుతో న్యాయపోరాటానికి దిగుతానని యాజమాని ప్రకటించడం గమనార్హం. మూగిజీవి మృతి పట్ల న్యాయపోరాటానికి దిగుతున్న ఆయన తీరు పలువుర్ని ఆలోచింప చేసింది.

శెట్టిపల్లి భూముల పరిష్కార దిశగా చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అధికారులతో ఎంఎల్ఎ సమావేశం

శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కార దిశగా చర్యలు వేగవంతం చేయాలని ఎంఎల్ఎ భూమన కరుణాకర్రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం శెట్టిపల్లి భూముల పరిష్కారంపై కలెక్టరేట్లో సమావేశం జరిగింది. భూమన కరుణాకర్రెడ్డి మాట్లాడుతూ శెట్టిపల్లి భూముల సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్రెడ్డి మాట్లాడుతూ శెట్టిపల్లి భూముల పరిష్కారానికి తగిన సిబ్బందిని నియమించి ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, ఆర్డీవో కనక నరసారెడ్డి, అర్బన్ ఎంఆర్ఓ వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్, అడిషనల్ కమిషనర్ సునీత పాల్గొన్నారు.

తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో భద్రతాపరమైన అంశాలపై ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(హెూం) హరీష్ కుమార్ గుప్తా సమక్షంలో మంగళవారం తిరుమల అన్నమయ్య భవన్లో ఉన్నత స్థాయి సెక్యూరిటీ ఆడిట్ జరిగింది. కోవిడ్ అనంతరం తిరుమలకు యాత్రికులు పెరగడం, వాహనాల రద్దీ పెరగడంతో భద్రతను ఎలా పెంచాలనే విషయమై చర్చించడానికి టిటిడి భద్రతాధికారులు, పోలీసు శాఖ, ఇతర శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. తిరుమలకు పటిష్టమైన భద్రత కోసం అన్ని దళాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని హరీష్ కుమార్ గుప్తా అభిప్రాయపడ్డారు. అంతకుముందు టిటిడి సివిఎస్వో నరసింహ కిషోర్, తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి వేర్వేరుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తిరుమలకు సంబంధించి ఇప్పటికే ఏర్పాటు చేసిన భద్రత, ఇంకా భద్రతను మరింత పటిష్టం చేయవలసిన ప్రదేశాల గురించి తెలియజేశారు. అనంతపురం రేంజి డీఐజీ అమ్మిరెడ్డి, ఓఎస్డీ ఐఎస్ డబ్ల్యూ శశిధర్ రెడ్డి, రాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, ఆక్టోపస్, ఎస్పీఎఫ్, జిల్లా పోలీసు, అటవీ, అగ్నిమాపక, ఇతర బలగాలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు. టీటీడీ తరపున జేఈవో వీరబ్రహ్మం, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ-2 జగదీశ్వర్రెడ్డి, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీదేవి, వీజీవోలు బాలిరెడ్డి, మనోహర్, గిరిధర్రావుతోపాటు పాల్గొన్నారు.

డాక్టర్ పవన్దత్తకు సివిల్స్లో 22వ స్థానం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతికి చెందిన విద్యార్థి పవన్దత్తకు సివిల్స్ జాతీయ స్థాయిలో 22వ స్థానం సాధించాడు. తండ్రి ఎల్ఐసి ఉద్యోగి. రాజంపేటలో ఉద్యోగం చేస్తున్నారు. తల్లి టీచర్గా పనిచేస్తున్నారు. రైల్వేకోడూరులో వీరు నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు పవన్దత్తా తల్లిదండ్రుల కోరిక మేరకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో ఇటీవలే ఎంబిబిఎస్ పూర్తి చేశాడు. పవన్దత్తాకు సివిల్స్పై మక్కువ కావడంతో ఎంబిబిఎస్ పూర్తయిన తర్వాత సివిల్స్ ప్రిపేర్ అయ్యారు. హైదరాబాదులోని సిఎస్బి ఐఏఎస్ అకాడమీలో కొంత కాలం శిక్షణ తీసుకున్నారు. మాక్ ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. మొదటి ప్రయత్నంలోనే సివిల్లో ఆల్ ఇండియా 22వ ర్యాంకును సాధించాడు. ఉత్తమ ర్యాంకు సాధించిన విషయం హైదరాబాదులోని అకాడమీ వారు సమాచారం ఇవ్వడంతో పాటు హైదరాబాదుకు రావాలని చెప్పడంతో హుటాహుటిన రేణిగుంట నుంచి హైదరబాదాకు విమానంలో పయనమయ్యారు. సివిల్స్లో ఉత్తమ ర్యాంకును సాధించిన పవన్దత్తాను పులువురు అభినందించారు.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి : ఎంపి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా తిరుపతి ఎంపీ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. విజయవంతంగా నాలుగు సంవత్సరాల సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, అలాగే తిరుగులేని విజయాన్ని అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారంజక పాలన అందిస్తున్న తమ ప్రభుత్వమే మళ్ళీ అధికారంలోకి వస్తుందని, మళ్ళీ మళ్ళీ జగన్ అన్నే ముఖ్యమంత్రి అవుతారని, 2024 లోనూ ఇంతకు మించిన మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఎక్కడ చూసినా 'ఉపాధి' సెగ

పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువు
పొట్టకూటి కోసం 'కూలీల' అగచాట్లు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ / వరదయ్యపాలెం / ఓజిలి

ఉపాధి హామీ గ్రామీణులకు అండగా ఉంటుందన్న మాట ఎంత వాస్తవమో... కనీస సౌకర్యాలు లేవన్నదీ అంతే స్పష్టం... ఏ పూట కాపూట పొట్టకూటి కోసం కూలీలు పనులకు వెళ్లాల్సిన పరిస్థితి.. మండు వేసవిలో వేసవి వడగాల్పుల మధ్యనా పనులు చేయక తప్పడం లేదు.. మరోవైపు గతంలో ప్రభుత్వం ఇచ్చే తట్టా, గునపం తదితరాలన్నీ ప్రస్తుతం కూలీలే తెచ్చుకుంటున్నారు.. నీరు, మజ్జిగ, వేసవి అలవెన్స్ సైతం ఆర్నెళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం ఆపేసింది.. దీంతో కూలీలు తట్టాబుట్ట, గునపం, నీళ్లు అన్నీ తీసుకుని సుదూర ప్రాంతాల్లో పనులు ఉన్నా వెళ్లక తప్పడం లేదు. తీరా వెళితే రూ.250 కూడా కూలి గిట్టుబాటు కాని పరిస్థితి. 'ప్రజాశక్తి' విలేకరులు క్షేత్రస్థాయిలో ఉపాధి పనుల కనీస సౌకర్యాలను పరిశీలించగా కూలీల అగచాట్లు హృదయవిదారకంగా ఉన్నాయి.

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలో మొత్తం 48 పంచాయతీలకు గాను 30 పంచాయతీల్లో మాత్రమే ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. మిగిలిన 18 పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత వల్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉపాధి కూలీలకు ప్రభుత్వమే పార, తట్ట, గడ్డపార వంటి పనిముట్లు కూలీలకు ఇవ్వాలి. కానీ అందుకు విరుద్ధంగా తామే వీటన్నింటినీ తెచ్చుకుంటున్నామని చెర్లోపల్లి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు వాపోయారు. వీరికి ప్రభుత్వం కల్పించాల్సిన నీరు, మజ్జిగ, టార్పాలిన్ పట్టలు, ప్రథమ చికిత్స కిట్ కూడా లేకపోవడంతో పనుల వద్ద ఎండ మండిపోతుంటే నరకం చూస్తున్నారు. ఈ విషయమై ఎపిఓ క్రిష్ణయ్యను వివరణ కోరగా ఉపాధి పని ప్రదేశాల్లో వసతులు లేవనే విషయం తన దృష్టికి రాలేదని, పని ప్రదేశాల్లో వసతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కుటుంబ పరిస్థితి బాగోలేకనే : గురవయ్య, కూలీ

కుటుంబం గడవకనే ఎండలు మండుతున్నా ఈ ఉపాధి పనులకు వస్తున్నాం. కనీసం ఇక్కడ తాగడానికి నీరుగాని, నిలవడానికి నీడగాని లేకుండా పోయాయి. అధికారులు స్పందించి నీరు, నీడ ఏర్పాటు చేస్తే కొంతైనా ఉపశమనంగా ఉంటుంది.

నల్ల 'పట్టల'తో విపరీతమైన సెగ

ప్రజాశక్తి - ఓజిలి

అంతోఇంతో ఓజిలి మండలంలో ఉపాధి కూలీలకు సౌకర్యాలు కొంత మెరుగ్గానే ఉన్నాయని చెప్పవచ్చు. ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా ముందస్తు ప్రణాళికతో ప్రతి పంచాయతీలో ఉపాధి కూలీలకు ఎఎన్ఎంలను అందుబాటులో ఉంచితే కొంతమేర ఉపశమనం ఉంటుంది. ఓజిలి మండల వ్యాప్తంగా ఏడువేల మంది ఉపాధి కూలీలు ఉండగా, ప్రస్తుతం ఎండ తీవ్రతకు 3,500 మంది మాత్రమే పనులు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎండ తీవ్రత తట్టుకునేందుకు ప్రభుత్వం నల్ల తార్పాల్ పట్టలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే నల్లరంగు వల్ల అధిక సెగ ఏర్పడుతుందని కూలీలు వాపోతున్నారు. గతంలో రూ.257 రూపాయలు ఉపాధి కూలీలకు చెల్లించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచి దినసరి కూలీలకు రూ.272 రూపాయలు చెల్లిస్తున్నారు. అంతోఇంతో వేతనం కొంత పెరిగి రావడంతో నిరుపేద కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉపాధి కూలీలకు రెండు వారాల నగదు చెల్లించాల్సి ఉంది. ప్లే స్లిప్పులు సైతం ఇవ్వాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు. ఉద్యాన వన పంటల కింద మరో వంద ఎకరాలకు ఉపాధి హామీ కింద చేసేలా ప్రతిపాదన పంపామని ఎంపిడిఓ వి.రజనీకాంత్ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

పే స్లిప్పులు ఇవ్వడం లేదు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

మండుటెండలో నీడ, నీరు ఏవీ అందుబాటులో లేవు. కనీస సౌకర్యాలు కల్పించాలని అడిగితే పనులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. గతంలో పనిచేసిన దినాలకు సంబంధించి ప్లే స్లిప్పులు ఇచ్చేవారు. అందులో వివరంగా పనిదినాలు, వచ్చిన డబ్బు, కేంద్రం అందిస్తున్న నగదుకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండేవి. కానీ ఇపుడు పే స్లిప్పులు ఇవ్వడం లేదు. దీంతో ఎన్ని రోజుకు నగదును అందిస్తున్నారో తెలియడం లేదు.



ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి : వ్యకాసం

తిరుపతి టౌన్ : గ్రామీణ ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.నాగరాజు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పనిగట్టుకుని పథకాన్ని రద్దు చేయాలని చూస్తోందన్నారు. నిధులు తగ్గించి, పని గంటలు పెంచి, రెండు పూటలా పనిచేయాలని వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. వేసవిలో మజ్జిగ, టెంట్లు లేవని,తాగడానికి కనీసం నీరు కూడా లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం సమ్మర్ అలవెన్స్ ఇచ్చేదని, ప్రస్తుతం రద్దు చేసి కూలీలకు సంబంధించి మొత్తం 'ఆన్లైన్ మస్టర్' అని చెప్పి నెట్ పనిచేయకపోతే అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పథకాన్ని పరిరక్షించకపోతే కూలీలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఉపాధి చట్టం ఉండబట్టి అంతోఇంతో పేదలకు పట్టెడన్నం దొరుకుతోందన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు పూటలా పని రద్దు చేయాలని, 200 పనిదినాలు కల్పించాలని, పట్టణాల్లోనూ ఉపాధి పనులు చూపించాలని, పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని, ఆన్లైన్ మస్టర్ రద్దు చేసి పాత పద్ధతి కొనసాగించి ప్లేస్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ భారంపై టీడీపీ గళం

ప్రజాశక్తి-దొరవారిసత్రం: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంటు ఛార్జీలను వెంటనే తగ్గించాలని మంగళవారం తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షులు వేమసాని శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో దొరవారిసత్రం కరెంటు సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలన వచ్చిన తర్వాత ఇప్పటికి కరెంటు ఛార్జీలు 7 సార్లు పెంచారని.. పేదలు కరెంటు ఛార్జీలు కట్టలేని స్థితిలో ఉన్నారని.. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచేసి పేదవాడు బతకలేక పలు ఇబ్బందులు పడుతున్నా నిమ్మకు నీరొత్తినట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు జకరయ్య, మండల ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, మండల బిసి సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి కష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ ఉదయ్ కుమార్, సర్పంచ్ మణి, నాయకులు ప్రసాద్‌నాయుడు, కిషోర్ నాయుడు, పురుషోత్తం, శ్రీనివాసరెడ్డి, గోపాల్ రెడ్డి, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిక: బీఎన్‌కండ్రిగలోని సబ్‌స్టేషన్ వద్ద సత్యవేడు టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ హెలెన్ హేమలత పిలుపుమేరకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంట్ ఛార్జీలు తగ్గించాలని.. రైతు మోటార్లకు మీటర్లు బిగిస్తే రైతుకు ఉరితాడు బిగించినట్టేనని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంటు ఇవ్వాలని.. లేని పక్షంలో తెలుగుదేశం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్నయ్యనాయుడు, ఉషారాణి, శ్రీనివాసులు, మురళీ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరు సబ్ స్టేషన్ ఎదుట కరెంట్ ఛార్జీలు తగ్గించాలని డిమాండు చేస్తూ టీడీపీ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇలంగోవన్‌రెడ్డి, పద్దురాజు, జయచంద్ర నాయుడు, రవినాయుడు, ప్రకాష్‌నాయుడు, వాసురెడ్డి, బత్తారెడ్డి, విజయ్‌కుమార్, అరుళ్ ప్రకాష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని పుత్తూరు సబ్ స్టేషన్ వద్ద టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, రూరల్ అధ్యక్షులు రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగంరెడ్డి, చిత్తూరు పార్లమెంటరీ టీఎన్‌టీసీ అధ్యక్షులు రావిళ్ల మాధవ నాయుడు, రాష్ట్ర యువత కోఆర్డినేటర్ డీజీ ధనపాల్, మాజీ వైస్ ఛైర్మన్ ఆనంద్, ఎన్ఎన్ ధనపాల్, బాబునాయుడు, బొబ్బిలి యాదవ్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి వద్దనున్న సబ్ స్టేషన్ ఎదుట మంగళవారం సూళ్లూరుపేట తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రమేష్‌నాయుడు, కే గోపాల్ రెడ్డి, శేఖర్‌నాయుడు, మురళీనాయుడు, శ్రీనివాసులు, బాలయ్య, వెంకటాచలపతి, ఏడుకొండలు, రమణయ్య, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యాస్ పైపులైన్ గుంతలను పూడ్చాలని నిరసన

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలో భూగర్భ గ్యాస్ పైపులైన్ పనుల కోసం తవ్విన గుంతలను వెంటనే పూడ్చాలని, ధ్వంసమైన సీసీ రోడ్ల స్థానంలో నూతన సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతూ సీపీఐ, ఇన్సాఫ్ సమితిల ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, ఇన్సాఫ్ సమితి రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్. జమాలుల్లా, సభ్యులు షేక్. ఇలియాజ్, హైదర్ అలీ, మహిళలు ఆసీఫా, షంషాద్, నాజిని, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీలో ఉపాధ్యాయుల వికాస సదస్సులు

ప్రజాశక్తి-కోట: కోట మండలంలోని విద్యానగర్ ఎన్బికేఆర్ఐఎస్టిలో ఐఈటిఈ ఆంధ్రప్రదేశ్ వారి సహకారంతో ఈసీఈ విభాగం, జేఎన్‌టీయూఏ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జాతీయస్థాయి ఐదు రోజుల ఉపాధ్యాయుల వికాస సదస్సులో ఎస్వీ యూనివర్సిటీలో ఈసీఈ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.శ్రీనివాసులు మంగళవారం రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ అప్రోచ్‌తో ఏఐ,ఎమ్ ఎల్, డీఎల్ ప్రాముఖ్యతను వివరించారు. అనువర్తనాలను విశీదీకరించారు. పాండిచ్చేరి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి.రమేష్ బాబు డీప్ లెర్నింగ్ ప్రాముఖ్యతను, బ్లైండ్ సోర్స్ సెపరేషన్ విశిష్టతను ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి విజయ్ కుమార్ రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి.హరినాథ్‌రెడ్డి, ఎన్.బి.కే.ఆర్ కళాశాల ఉపాధ్యాయులు, ఇతర కళాశాలల ఉపాధ్యాయులు, డాక్టర్ ఎస్ కే.మెహబూబ్‌బాషా, వల్లిబాషా పాల్గొని జయప్రదం చేశారు.

మందకృష్ణను విమర్శించడం తగదు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మందకృష్ణ మాదిగను విమర్శించడం మంత్రి పెద్దిరెడ్డికి తగదని ఎమ్మార్పీఎస్ నియోజవర్గ ఇన్‌ఛార్జి వావిళ్ల శివయ్య అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో వడమాలపేటలో మాట్లాడుతూ మాదిగల ఆరాధ్య దైవం మందకష్ణ మాదిగ అని.. అధికార పార్టీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మందకష్ణను విమర్శించేస్థాయి కాదన్నారు. దళిత సంఘాల వారు నిరసన చేపట్టారు. దేశం, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపైన దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని.. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా పెద్దిరెడ్డి మాట్లాడుతున్నారని.. ఇలాగే కొనసాగితే దళిత సంఘాలు, ప్రజాసంఘాలు ఏకమై తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా నాయకులు దారా జానకిరామ్, ఎస్సీ, ఎస్టీ జిల్లా కార్యదర్శి వేలావడి నందయ్య, ఎంఎస్పీ జిల్లా నాయకులు నరేష్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు అర్జునయ్య, భాస్కర్, మధు, కళ్యాణ్ కుమార్, సుధాకర్, దినేష్, శ్రీనివాసులు, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

2న యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

ప్రజాశక్తి-గూడూర్ రూరల్: జూన్ 2వ తేదీన యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు విజయమహల్ గేట్ సమీపంలోని పీసీఎస్ కళ్యాణ మండపంలో పదో తరగతిలో 500 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తామని వై.ఈ.పి.ఎ గౌరవ సలహాదారుడు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు. గూడూర్, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి డివిజన్లలోని యాదవ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల పేర్లు నమోదు చేసుకోవడానిక ఫోన్‌నంబరు 9948606664 ను సంప్రదించాలని కోరారు.

రేపు నాయుడుపేటలో గంధ మహోత్సవం

ప్రజాశక్తి-నాయుడుపేట: ఈనెల 25, 26వ తేదీల్లో నాయుడుపేటలో హజరత్ ఖాదర్ షహవలి చిన్న దర్గా ఉరుసు గంధ మహోత్సవ వేడుకలు జరుగనున్నాయని.. ప్రతిఒక్కరూ పాల్గొనాలని చిన్నదర్గా వ్యవస్థాపక నిర్వాహకులు నీలిశెట్టి కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు తెలిపారు. పలు కారణాలతో గత పదేళ్లుగా దర్గాలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదు. పదేళ్ల తర్వాత కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందరి సహకారంతో గంధ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్సీ మేరిగ మురళీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని సనత్‌నగర్‌లో ఉన్న ఎమ్మెల్సీ మేరిగ మురళీ నివాసంలో ఆయన పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు చేరుకుని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యకర్తలు ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంతో నిజాయితీగా బాధ్యతలు నిర్వహించానని, కొన్ని పరిస్థితుల కారణంగా గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం రాలేదన్నారు. నేను చేసిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ యామిని, నాయకులు మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, బాబు రెడ్డి , గోపాల్‌యాదవ్, బట్ట గోపి యాదవ్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పిచ్చాటూరులో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-పిచ్చాటూరు: స్థానిక ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి తెలిపారు. తిరువళ్ళూరుకు చెందిన ఎం.ఎన్. కంటి ఆసుపత్రి వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తారకరామనగర్‌లో గంగమ్మ జాతర

ప్రజాశక్తి-రేణిగుంట: కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో శ్రీ పర్వతాల గంగమ్మ తల్లి జాతర వేడకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి తనయుడు బియ్యపు ఆకర్షరెడ్డి అమ్మవారికి సారెను సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ఉత్సవ కమిటీతోపాటు వైసీపీ నాయకులు మన్యం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల విద్యాభివృద్ధికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రేణిగుంట: యువనేస్తం అసోసియేషన్ 3వ వార్షికోత్సవం సందర్భంగా రేణిగుంట పట్టణంలోని నాగార్జున హైస్కూల్ కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి గిరిజనుల విద్యాభివృద్ధికి తన వంతు సాయంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. మంగళవారం అసోసియేషన్ సభ్యులు కలిసి వార్షికోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ యువ నేస్తం అసోసి యేషన్ చేస్తున్న సేవలను తాము ఎప్పటికప్పుడు చూస్తున్నామని, ముఖ్యంగా గిరిజన కాలనీలలో విద్యను ప్రోత్సహించడానికి వారు చేస్తున్న కషి అభినందనీయమన్నారు. తమవంతు సాయం అందించామని తెలిపారు. యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్ పాల్గొన్నారు.

శ్రీపోలేరమ్మను దర్శించుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే



ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి గ్రామదేవత శ్రీ శ్రీ పోలేరమ్మ తల్లిని మంగళవారం ఉదయగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకుడు మస్తాన్ యాదవ్ దర్శించుకున్నారు. ఆలయ పూజారి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామీణులకు అందుబాటులో వైద్యం

ప్రజాశక్తి -దొరవారిసత్రం : దొరవారిసత్రం పీహెచ్‌సీ పరిధిలోని నేలపట్టు గ్రామంలో మంగళవారం విలేజ్ డాక్టర్ కాన్సెప్ట్ కింద వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ చైతన్య వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంపూర్ణమ్మ, ఏఎన్ఎం వెంకమ్మ, హెల్త్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలంలోని అప్పలాయిగుంట ఆలయంలో మే 31 నుండి జూన్ 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఉదయం 11.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు.

శాంత కుమారికి జాతీయ ఛాంపియన్‌షిప్ అవార్డు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

రెండో జాతీయ కర్లింగ్ ఫ్లోర్ ఛాంపియన్‌షిప్‌ను తిరుపతికి చెందిన మహిళా పోలీసు ఎబి.శాంతకుమారి కైవసం చేసుకుంది. ఇటానగర్‌లో ఈ నెల 19 నుండి 21 వరకు జరిగిన పోటీలలో 9 రాష్ట్రాలు నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. 400 మంది క్రీడాకారులతో సీనియర్ టీమ్ ఎబి.శాంతకుమారి, సాయి సుమతి, కవిత, మరే సుష్మ మొదటి 3వ స్థానాల్లో నిలిచారు. మిక్స్‌డ్ టీమ్ ఎబి.శాంతి కుమారి, సతీష్ 3వ స్థానం కైవసం చేసుకున్నారు. మొత్తం 2 పతకాలు, 3వ ప్యాలెస్ మెడల్‌ను అందించారు. ఈ పోటీల్లో గెలిచిన విజేతలకు అరుణాచల్ ప్రదేశ్ సీఎం యోగేశ్వర్ దత్వి చేతులు మీదుగా ఈ మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఛాంపియన్ షిప్ మిక్స్ విభాగంలో బ్రోన్జ్, మహిళా విభాగంలో బ్రోన్జ్ పథకాన్ని సాధించిన తిరుపతికి చెందిన బి.శాంతకుమారి(ఎమ్మెస్కె) అలిపిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో అరుణాచల్ ప్రదేశ్ క్రీడా మంత్రి, మూడో ఇండియన్ వెజిలర్ 2012 యోగేశ్వర్ దత్ తదితరులు హాజరయ్యారు.

మా భూమిని దొంగ డాక్యుమెంట్లతో కబ్జాచేశారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పిత్రార్జితంగా మాకు సంక్రమించిన 10 సెంట్లు భూమిలో మా బాబాయ్ అయిన సింగం సుగ్రీవ రెడ్డి స్థానిక దుర్గిపేరి గ్రామపంచాయతీ సర్పంచి ముని రామిరెడ్డి ప్రోద్బలంతో రెండు సెంట్లు భూమికి దొంగ డాక్యుమెంటను సష్టించి కబ్జాచేశారని బాధితురాలు సుశీల వాపోయింది. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం దుర్గిపేరి గ్రామపంచాయతీలో తమ ఉమ్మడి కుటుంబానికి సంబంధించిన 20 సెంట్లు భూమి ఉందన్నారు. గత కొన్నాళ్లుగా తమ భూమిపై కన్నేసిన సింగం సుగ్రీవ రెడ్డి సదరు భూమిని తనకు అమ్మాలని కోరారన్నారు. అయితే తాము ఆ భూమిని అతనికి ఇవ్వడం ఇష్టం లేదని, తన కూతుళ్ళ పెళ్లిళ్లకు ఈ భూమిని వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నామన్నారు. అయితే స్థానిక సర్పంచి మునిరామిరెడ్డి ప్రోద్బలంతో తమభూమికి దొంగ డాక్యుమెంట్ సష్టించి తమ వాటాగా మాకు దక్కాల్సిన పది సెంట్లులో రెండు సెంట్లు భూమిని కబ్జా చేశారన్నారు. దీనిపై కలెక్టర్‌కు స్పందనలో అర్జీ ఇచ్చిన, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వద్దకు వెళ్లి చెప్పినా, జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేసిన న్యాయం జరగడం లేదన్నారు. పైగా అధికారులు తమ వద్దకు వచ్చి తమ భూమిని అతనికి ఇవ్వాలని సలహాలు ఇస్తున్నారని కన్నీరు మున్నీరుగా వినిపించారు. ఉన్నతాధికారులైన స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో యశోద పాల్గొన్నారు.

మహిళా సంరక్షకుల పాత్ర ప్రశంసనీయం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి గంగమ్మ జాతర ఉత్సవాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శుల పాత్ర ప్రశంసనీయమని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్ అన్నారు. గంగమ్మ జాతరలో చక్కగా విధులు నిర్వహించి ఇతరులకు ఆదర్శనీయంగా నిలిచారని మహిళా సంరక్షణ కార్యదర్శులనుద్దేశించి తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి అన్నారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరలో విశిష్ట సేవలందించిన తిరుపతి నగరపరిధిలోని సచివాలయాల్లోని మహిళా సంరక్షణ కార్యదర్శులు 61 మందికి తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి.రవి పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఉత్తమ సేవా అవార్డులు

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడు, చెంబేడు, పునబాక గ్రామ సచివాలయాల్లో మంగళవారం సేవామిత్ర అవార్డులకు ఎంపికైన వాలంటీర్లకు మండల ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు అవార్డులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రయ్య, గోపాలయ్య, శ్యామ్ రెడ్డి, బీసీ సంక్షేమ మండల అధ్యక్షుడు చంద్రబాబు యాదవ్, శీనయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

'కౌటిల్య' విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు

తిరుపతి టౌన్ : ఎంఆర్‌పల్లిలోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పది మందికి పైగా విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్ హయ్యర్ గ్రాడ్యుయేట్ లెవల్ ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగాలు లభించాయి. ఈ వారం విడుదలైన ఎస్ఎస్‌సి తుది ఫలితాల్లో ఎనిమిది మందికి పైగా తిరుపతి కౌటిల్య విద్యార్థులకు ఎస్-ఎస్‌సి కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఆఫీసర్ ర్యాంకు ఉద్యోగాలను సాధించారు. వీరితో పాటు ఇటీవల ఐబిపిఎస్ విడుదల చేసిన తుది ఫలితాల్లో మరో ఏడుగురికి పైగా విద్యార్థులకు బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసర్, క్లర్కు ఉద్యోగాలు పొందారు. ఈ విద్యార్థులను కౌటిల్య సంస్థ డైరెక్టర్ శ్రీధర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌటిల్య ఫ్యాకల్టీ ఎన్.హరి, ఎస్.ఎస్. రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఆన్‌లైన్ ఎగ్జామ్స్ సాధన చేస్తే తప్పక సాధిస్తామన్నారు. ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలలో ఆర్థిక మాంధ్యం ద్వారా ఎన్నో ఒడిదుడుకులు ఏర్పడుతున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో ఉద్యోగంలో స్థిరత్వం, సమాజంలో గుర్తింపు, సేవ, ఒత్తిడి లేని మంచి కెరీర్ కోసం గవర్నమెంట్ జాబ్స్ కోసం విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో, సానుకూల దృక్పథం ఉంటే సరిపోతుందన్నారు.

మట్టిని రక్షించాలని సైకిల్ ర్యాలీ

తిరుపతి (మంగళం) : మనిషి తన స్వార్థానికి

ప్రకృతిని అపరిమితంగా వినియోగించుకుంటూ మట్టిని నిర్వీర్యం చేస్తున్నాడని పర్యావరణ ప్రేమికుడు, ఉత్తరప్రదేశ్ లలిత్పూర్‌కు చెందిన మోహిత్ నిరంజన్ తెలిపారు. మట్టిని కాపాడుకోవాలని అవగాహన కల్పిస్తూ దేశవ్యాప్త సైకిల్ ర్యాలీ చేస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో " సేవ్ సాయిల్ " అనే నినాదంతో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహిత్ నిరంజన్ మాట్లాడుతూ మట్టిని రక్షించు అనే నినాదంతో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 200 రోజులుగా సైకిల్ యాత్ర చేస్తున్నానన్నారు. ఒకప్పుడు సేంద్రీయ ఎరువులతో పంటలు పండించి ఎంతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపే మనం నేడు రసాయనిక ఎరువుల వినియోగం, ప్లాస్టిక్ వినియోగం, కలుషిత రసాయనాలు జీవనదులలో కలవడం, అడవుల శాతం తగ్గిపోవడం మిగిలిన కారణాలతో నేడు భూమిపై అంచనా వేయలేని వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇవి ఇగానే కొనసాగితే భవిష్యత్తు తరాలకు ఆహార ధాన్యాలు అందించడం కూడా తీవ్ర కష్టసాధ్యమయ్యే పరిస్థితులు నెలకొంటాయన్నారు. అమెరికాకు చెందిన పర్యావరణ ప్రేమికులు శివాజీ మాట్లాడుతూ శేషాచలం అడవుల్లో ఉన్న ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమానికి స్వతహాగా పనిచేశామన్నారు. అన్నమయ్య కాలిబాట, మాల్వాడిగుండం ప్రాంతాల్లో, శేషాచలం అడవుల్లో టన్నుల కొద్ది ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పంపించామన్నారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు జగన్నాథం, నీలిమ, కిషోర్, సోమేశ్వర్, రాజేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

గాయం సుభాషిణి అను నేను నా స్వగ్రామం విన్నమాల నుంచి ఈ నెల 18/05/2023న నాయుడుపేటకు ఆటోలో వస్తుండగా నా ఇంటికి సంబంధించిన ఒరిజనల్ డాక్యువెంటు నెం.2247/2022 దారపోయినది. ఎవరికైనా దొరికిన యెడల సెల్ నెం. 9440188852 కు సమాచారం ఇవ్వగలరు.

గాయం సుభాషిణి
భర్త అమవారపు సత్యనారాయణ
విన్నమాల గ్రామం మరియు పోస్టు
నాయుడుపేట మండలం, తిరుపతి జిల్లా.
సెల్ నెం.9440188852.

IN THE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
O.S.No. 389 of 2021

Between:
Minor K. Rohith Sai, rep., by his Mother K. Latha as his guardian,
... **Plaintiff**
And:1
)K. Armugam Pillai,
2)K.A. Durga Prasad, **... Defendants**

SUMMONS TO THE DEFENDANT

To:
K.A. Durga Prasad, S/o K. Armugam Pillai, aged about 42 years, Cultivation & Business, r/at D.No.4-11-S3-449, Reservoir Road, Giripuram Street, Tirupathi Urban and District.
Sir, Please take notice that the above named plaintiffs filed the above suit against you for partition and for other reliefs and the above suit is posted for your appearance before the Hon'ble court on **28.06.2023.** Please be present on the said date before the Hon'ble court at about 10:30 AM either in person or through an advocate and to raise objections if any, failing which, the matter will be decided exparte in your absence.

Sd/- K.SATHYA MOORTHY,
Advocate,Chittoor.
Place: Chittoor, Date : 24.05.2023

IN THE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
I.A.No. 294 of 2021
O.S.No. 389 of 2021

Between:
Minor K. Rohith Sai, rep., by his Mother K. Latha as his guardian,
... Petitioner/Plaintiff
And:
K. Armugam Pillai & another,
...Respondents/Defendants

SUMMONS TO THE RESPONDENT

To:
K.A. Durga Prasad, S/o K. Armugam Pillai, aged about 42 years, Cultivation & Business,r/at D.No.4-11-S3-449, Reservoir Road,Giripuram Street, Tirupathi Urban and District.
Sir, Please take notice that the above named petitioners filed the above I.A. against you for injunction and for other reliefs of petition mentioned schedule properties and the above I.A. is posted for your appearance before the Hon'ble court on **28.06.2023.** Please be present on the said date before the Hon'ble court at about 10:30 AM either in person or through an advocate and to raise objections if any, failing which, the matter will be decided exparte in your absence.

Sd/- K.SATHYA MOORTHY,
Advocate, Chittoor.
Place: Chittoor, Date : 24.05.2023